# వేటకుక్కలు

**—శ్రీమధుకర్జీ**

గడియారం పది కొడుతుండగా సుచరిత ఆఫీసులో అడుగు పెట్టింది. సుచరిత రాకతో గుసగుసలు, గల గల నవ్వులు ఒక్కసారే ఆగిపొయ్యాయి. పదుల కళ్ళు సుచరితను నిశ్శబ్దంగా, తమకంగా, ఆశగా గమనిస్తున్నాయి. ఇవేవీ పట్టించుకోకుండా అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకం పెట్టి సుచరిత తన సీట్లో కూర్చుంది. క్రితం రోజు పూర్తికాని ఫైలు ముందేసుకుని— ఆ ఫైలు పని చూడటంలో మునిగిపోయింది సుచరిత.

'ఒరే సుబ్బూ! మరీ అంత వర్క్ మైండ్ ప్రమాదంరా—' సుబ్బు అనబడే సుబ్బరామయ్యను సుబ్బారావు ఎత్తి పొడిచాడు. కానీ— ఆ విసురు సుబ్బు మీద కాదని అందరికీ తెలుసు...

'వాడికేంరా... సంసారమా... పిల్లలా...?

—అవధాని జోడించాడు.

'అయ్యో... సుబ్బుగాడికేంరా... యివ్వాళ కాకున్నా రేపైనా ఓ ఇంటి వాడవుతాడు లక్షణంగా... అయినా వాడలానే బెండకాయలా ముదిరిపోవటానికి మూడు పదులు దాటిన అమ్మడనుకున్నావట్రా...'

ఆచారి జోకుకు ఆఫీసులో అందరూ పగలబడి నవ్వారు.

ఆ నవ్వులు సుచరిత గుండెల్లో గునపాల్లా గుచ్చుకున్నాయి. సుచరిత వినాలనే... విని కుళ్ళి కుళ్ళి మనసులో ఏడ్వాలనే వాళ్లలా కుళ్ళు జోకులు పేలుస్తున్నారు. ఎదుటి మనిషి మనసును హింసించి ఆనందించే శాడిస్టు మనస్తత్వం జీర్ణించుకున్న వ్యక్తుల ప్రవర్తన అంతకన్నా భిన్నంగ వుండదు మరి!

మనిషి మారణాయుధాలతో చంపటంకన్నా మాట లతో చంపటం సులువన్న థియరీని ప్రాక్టీసులో పెడుతున్న చదువుకున్న మేధావులు వారు.....

అవును. సుచరిత మూడు పదులు నిండిన అమ్మాయే. కానీ— పెళ్ళి చేసుకోకుండా వుండటం ఆమె ఆదర్శమూ కాదు... అభిమతమూ కాదు. బి. ఏ. మొదటి సంవత్సరం నుండే సుచరిత తండ్రి పెళ్ళి సంబంధాల వేటలో దిగనైతే దిగాడు కాని ఫలితాన్ని సాధించలేకపోయాడు. విధి వక్రించి సంబంధాల వేటలోనే ఓ ఆక్సిడెంటుకు బలైపోయాడు. చిన్నప్పుడే తల్లికి దూరమైన సుచరిత— బి. ఏ. పూర్తయ్యేసరికి తండ్రిని కూడా పోగొట్టుకుంది. ఆ తర్వాత సుచరిత బాబాయిలు, పిన్నమ్మలు అతి కష్టం మీద కొన్ని సంబంధాలు తీసుకు రాగలిగారే తప్ప— ఏ సంబంధాన్ని వివాహ వేదిక మీదకు తీసుకు రాలేకపోయారు. ఈ ప్రయత్న పరంపరలోనే మరో నాలుగేళ్ళు గడిచాయి.

విజయవాడలో ఓ ఆఫీసులో క్లర్క్ ఉద్యోగం రావటంతో సుచరిత జీవిత గమనంలో ఓ మార్పు చోటు చేసుకుంది. ఉద్యోగం లేక ముందు కట్నం చాలదనో వంకలు పెట్టిన 'మగ పెళ్ళిధీరులు' యిపుడు క్రొత్త నినాదం చేపట్టారు— 'అమ్మాయి వయసు మరీ ఎక్కువున్నట్టుందండీ—' అంటూ.

పదహారేళ్ళ యవ్వన జిగి పాతికేళ్ళకుండదు.

పాతికేళ్ళ అందం మూడు పదుల కుండదు.

సుచరిత పెళ్ళి చూపుల తతంగం మరచి అప్పుడే దాదాపు రెండు సంవత్సరాలు కావస్తోంది. ఓ స్నేహితురాలింట్లో ఓ గది అద్దెకు తీసుకుని గుండె దిటవు పరుచుకుని జీవితంతో పోరాడుతోంది.....

సుచరిత కళ్ళెత్తి అందరి వంక ఓసారి చూసింది. ఆ చూపులో కోపంలేదు.... బాధ తప్ప. ఆ చూపులో ఈసడింపులేదు.... అభ్యర్థన తప్ప.

పదకొండు కొడుతుండగా ఆఫీసరు వచ్చారు.

ఆఫీసరు గదిలోకి పోతూ సుచరిత వంక చూసిన మగచూపుకు ఆమె ఒళ్ళంతా బాధతో, అర్థంకాని భావంతో కుంచించుకు పోయింది. అయినా క్షణాల్లో తమాయించుకుంది.

ప్యూన్ రంగన్న ఆ రోజు వచ్చిన ఉత్తరాలు తీసుకువచ్చాడు. అందులో నుండి సుచరితకు కూడ ఓ కవరందించాడు. ఆ కవరు చూస్తూనే సుచరిత గుండెలు జల్లుమన్నాయి. కవరు మీదున్న దస్తూరి చూసింది. కొత్తగా పరిచయంలేని దస్తూరి. ఇంతకు మునుపు... అలా పరిచయంలేని దస్తూరి గల కవర్లు మోసుకొచ్చిన 'దుర్గంధాన్ని, కుళ్ళును' చూసిన మనసు— ఆ కవరును చించాలా, మానాలా అన్న సందిగ్ధంలో పడింది. వదిలేస్తే... ఏదైన విలువైన సమాచారం వుందేమోనన్న దిగులు.

సుచరిత కవరు చించి అందమైన గులాబి రంగు కాగితం బయటకు తీసింది. కాగితం నుండి ఖరీదైన సెంటు వాసనలు గుబాళిస్తున్నాయి.

డియర్ సుచరితా!



నిన్ను మనస్ఫూర్తిగా ఆరాధించే యెందరిలో నేనూ ఒకన్ని అదేం చిత్రమో కాని నీ వయస్సు పెరుగుతున్నా.. రోజు రోజుకూ నీ అందం యినుమడిస్తూనే వుంది. కానీ డియర్! నేను చాలా దురదృష్టవంతుణ్ని కనీసం రెండు సంవత్సరాల క్రిందటయినా నిన్ను చూసి వుంటే అదృష్టమే నాకు కలిగి వుంటే.. నిన్ను యిప్పటికి నా అర్ధాంగి స్థానంలో ఆనందంగా స్వీకరించి యుండేవాడిని .. ప్చ్.. విధి మనకా అదృష్టాన్ని యివ్వలేదు. పోని డియర్... జరిగిన దాన్ని గురించి ఆలోచించి బాధ పడటం కంటె వర్తమానంతో రాజీ పడటం మంచిది కదా! నీ అందం. యవ్వనం యిలా వూరికే అడవిగాచిన వెన్నెల కావటం నాకెంతో బాధగా వుంది అందుకే నిన్ను రా రమ్మని ఆహ్వానిస్తున్నాను. ఇవ్వాళ సాయంకాలం లీలామహల్ దగ్గరకు వచ్చెయ్. అక్కడే ఈ ప్రేమ ఉపాసి తనను నీకు పరిచయం చేసుకుంటాడు హృదయం విప్పి చెప్పుకుంటాడు ఆ తర్వాత. యింకేముంది డియర్. నాకు నువ్వు నీకు నేను ..ఒకే. వస్తావు కదూ

నీ రాక కోసం వేయి కన్నులతో నిరీక్షించు
సుచరితా రాధకుడు

ఉత్తరం పూర్తయ్యేసరికి సుచరిత కళ్ల నిండా కన్నీరు... సుచరితకు తెలుసు ఆ ఉత్తరం వ్రాసినవాళ్ళు బయటివాళ్ళు మాత్రం కారు– తన ఆఫీసు వారేనని. తెలిసి మాత్రం చేయగలిగింది ఏముంది?

సుచరిత జీవితం ఏనాడో అరిటాకయ్యింది. ఇంతకు మునుపు మొదటిసారి అలాటి 'కుళ్ళు ప్రేమ' ఉత్తరం వచ్చినప్పుడు ఆ కోపాన్ని, బాధను, ఆవేశాన్ని, అవమానాన్ని మనసులో దాచుకోలేక ఆఫీసరుకు రిపోర్టిచ్చింది.

అప్పుడు ఆఫీసరు ఆ ఉత్తరాన్ని తాపీగా చదివి పడీ పడీ నవ్వి – సుచరిత కళ్లలోకి అదోలా చూస్తూ– చూడు సుచరితా! యిది హైస్కూలో, కాలేజో కాదు... ప్రేమ లేఖల గొడవలు పరిశీలించటానికి. అయినా యింత రాద్ధాంతానికి కారణం నీకు పెళ్ళి కాక పోవడమే కదా... ఏళ్ళు మీద పడుతున్నా యింకా కుర్రకారులోనే మొగుళ్ళు దొరకాలంటే కుదురుతుందా.. రెండో పెళ్ళివాడినో మూడో పెళ్ళి వాడినో ట్రై చెయ్యక పోయవా.. పోని నేను చూడనా....' మళ్ళీ పడీపడీ నవ్వాడు.

ఎదుటి మనిషి ఏడ్పును చూసి నవ్వే రాక్షసత్వం ..

అందుకే సుచరిత మళ్ళీ మళ్ళీ అలాటి కుళ్ళు వుత్తరాలు వచ్చినా–మౌనంగా చించి పోగులు పెట్టిందే కాని.. ఎవ్వర్నీ పల్లెత్తు మాటనలేదు. ఎవ్వరిమీద ఆఫీసరుగారికి కంప్లైంటు యివ్వలేదు.

సుచరిత ఉత్తరాన్ని స్మరున చించింది.

'అరే సుబ్బూ.. మరి అంత కోపమైతే ఎలారా....' అవధాని.

'అంత కోపమైతే నేనెంత బాధపడతానో తెలుసా–' ఆచారి పాట

# వేటకుక్కలు

'సత్యభామకు కోపమొస్తే కృష్ణుడంతటి వాడు ఆ భామ కాళ్ళు పట్టాడట.... ఆ కథ నీకు తెలుసట్రా ఆచారీ....

'ఆఁ! తెలుసులేవోయ్.... ఎటూ లొంగి వస్తుంది-కదా అని గురుడు కాస్తంత డ్రామా ఆడాడు. అంతమాత్రం ష్యూరిటీ వుంటే–నేను కాళ్ళు పట్టటమే కాదు.... చెప్పు దెబ్బలు కూడా ఆనందంగా తింటా–' సుబ్బు అంటుకున్నాడు.

జోకు బ్రహ్మాండంగా పేలింది. ఆఫీసునిండా నవ్వులు విరిశాయి. ఆ వెకిలి నవ్వులు సుచరిత మనసును వాడి శూలాల్లా గుచ్చాయి. ఉబకి వస్తున్న దుఃఖాన్ని పళ్ల బిగువున ఆపుకుంది. వాళ్లలా పగబట్టిన శత్రువుల్లా సుచరితను ఏడిపించటానికి ఓ కారణముంది.

నాలుగు రోజుల క్రితం లంచ్ సమయంలో –

'హల్లో సుచరితగారూ! లంచ్ బ్రేక్‌లో కూడా పనేనా.... పదండి.. . అలా కాంటీన్‌దాకా సరదాగా కబుర్లు చెప్పుకుంటూ వెళ్లి టీ తీసుకుందాం ..' సుబ్బు సుచరిత సీటు దగ్గరకు వచ్చి ఆప్యాయత కురిపించాడు.

'థాంక్స్.. మీరు వెళ్లండి.... నాకు కాఫీ తాగాలని లేదు....'

'కాఫీమీద అయిష్టమా.... లేక నాతో కలిసి రావటం అయిష్టమా'– అదో రకంగా చూస్తూ అడిగాడు. ఆ చూపుకు సుచరిత మనసు భగ్గుమంది. .

'రెండూనూ....'

'ఆహా' ... మరి ఆ రామారావుగాడితో తాగటం యిష్టమన్నమాట....'

'చూడండి సుబ్బరామయ్యగారూ.... నా యిష్టాయిష్టాలలో మీ జోక్యం అనవసరం....' నిర్లయంగా చెప్పింది సుచరిత.

'ఆ జిడ్డు వెధవకంటే నేను తీసిపోయానన్న మాట. .. వాడిమీద అంతగా మోజు పెంచుకోటానికి వాడిలో ఏం చూశావేమిటి–' వ్యంగ్యం.

యూ స్టుపిడ్.... డోన్ట్‌బార్క్ రాట్.. గెట్ అవే ఫస్ట్.. .' కోపం హద్దుల్ని దాటి ఆడ భుజంగంలా బుసలు కొట్టింది సుచరిత.

'యూ డర్టీ బిచ్.... ఈ సుబ్బు తడాఖేమిటో చూపిస్తాను....' సుబ్బరామయ్య చరచరా వెళ్ళిపోయ్యాడు.

అంతే ! అప్పటినుండి సుబ్బు బృందం సుచరితను సాధ్యమయినంత దారుణంగా ఏడిపించుక తినటం ప్రారంభించారు. వెకిలి జోకులు, డర్టీ కామెంట్సు, బూతు పాటలు విజృంభించాయి.

తప్పదు.. సుచరిత మౌనంగా కనీళ్లతో అన్ని అవమానాల్నీ ఎదుర్కొంటోంది....

'సుచరితమ్మగారూ....'

ప్యూన్ రంగన్న పిలుపుతో మనసును సంబాళించుకుంది.

'మీ పైలు పని పూర్తి చేసి అయ్యగారికి చూపించి మరీ వెళ్లమన్నారమ్మా.... అది చాల అర్జంటట....'

సుచరిత గుండెలు గుభేలుమన్నాయి. గడియారం వంక చూసింది. చేస్తున్న పని వేగాన్ని పెంచింది. మనసును, మెదడును కేంద్రీకరించింది.

గడియారం ఐదు గంటలు కొట్టింది. ఒక్కొక్కరే పనులు ముగించి వెళ్ళిపొయ్యారు. ఆ సెక్షన్‌లో మిగిలింది సుచరిత, ఆఫీసరు యిద్దరే.. మరో అర గంట అదనంగా పని చేసి పైలు పూర్తి చేసి ఆఫీసరు గదిలోకి తీసుకెళ్ళింది.

'కూర్చో....'

సుచరిత కూర్చోలేదు. ఆఫీసరు తలెత్తి ఆమె కళ్లలోకి సూటిగా చూశాడు. ఆ చూపుల భావం సుచరిత కర్థమయ్యింది. అయితేనేం....?!

'ఫర్వాలేదు కూర్చో.... నీతో ఓ ముఖ్య విషయం మాట్లాడాలి....'

అదిరే గుండెలను, చెదిరే మనసును కుదుటపరుచుకుంటూ – ముళ్లమీద కూర్చున్నట్టుగా కూర్చుంది.

'నీ కొలీగ్స్ నిన్ను టీజ్ చెయ్యటంలో మరీ విజృంభించినట్టుంది–ఔనా–'

సుచరిత తలూపింది. వెంటనే ఆఫీసరు పగలబడి నవ్వాడు.

'ఓహ్.... సుచరితా! ఐ పిటీ యూ... అయినా నీకో మాట చెప్పాలి.... పంట కొచ్చిన చేనుకు కంచె కావు ఎంతవసరమో–వయసొచ్చిన ఆడ పిల్లకు ఓ మగ రక్షణ కూడా అంతే అవసరం.... అవునా....'

సుచరితకు మళ్ళీ తలూపక తప్పలేదు.

'ఇఫ్ యు డోన్ట్ మైండ్.... నేనో మాట చెప్పనా..... నీ కెప్పుడో మూడు పదులు దాటాయి కాబట్టి.... యిహ పెళ్లయ్యే యోగం వుండదు. ఇలా పెళ్ళి లేకుండా.... మగ రక్షణ లేకుండా నీవు వున్నన్నాళ్ళు ఈ తోడేళ్ళు వెంట పడుతూనే వుంటాయి..... అందుకోసం...'

సుచరిత తలెత్తటంతో ఆఫీసరు ఒక్షణం ఆగాడు.

'నీకు మగ రక్షణ నేనిస్తాను'

సుచరిత రక్తం కోపంతో మరుగుతోంది.

అయినా అతి కష్టం మీద తమాయించుకుంటోంది.

'అంటే ... మీకు పెళ్ళయింది కాబట్టి.... నన్ను ఉంచుకుంటారన్న మాట....' చివరిపదం వత్తి పలికింది.

'పెళ్ళి కాకుంటే తప్పకుండా చేసుకునుండేవాన్ని.. .'

సుచరిత ఆఫీసరుకేసి కనీళ్లతో సూటిగా చూసింది యాభై ఏళ్ళు దగ్గర పడుతున్న ఆ ఆఫీసరులో యిపుడు సుచరితకు కనబడుతున్నది అతని చదువు, హోదా, వయసుకాదు– కేవలం 'మగ బుద్ధి'–

కుర్చీలో నుండి ఒక్కసారిగా లేచి గది దాటింది.

'సుచరితా! నో హర్రీ... తీరిగ్గా ఆలోచించుకొనే నిర్ణయాన్ని తెలియజెయ్యి-'

తన కొలీగ్స్‌లోని కుళ్ళు బుద్ధికి, ఆఫీసరు బుద్ధికి ఎలాటి తేడా కనపడలేదు సుచరితకు.... అందరూ మగ తోడేళ్ళే అంతా వేట కుక్కలే....

బస్టాండ్-

ఎప్పటిలానే రద్దీగా వుంది. ఎంతకూ రాని సిటీ బస్ కోసం సుచరిత నిరీక్షిస్తోంది-తనను అదే పనిగా వెంటాడుతున్న కళ్ల తాకిడి నుంచి తప్పించుకోటానికి. .. కాస్తంత దూరంగా నుంచుంది.

నువ్వు ఎదురు చూచే బస్సు ఓ జీవితకాలం లేటన్నాడు ఓ కవి-' తనే ఆ కవి నన్నంత ధీమాగా అన్నాడు ఓ బెల్‌బాటమ్ స్టూడెంట్.

'అలాగే నువ్వెదురు చూచే పెళ్లి కొడుకు మూడు పదులు దాటినాసరే రాడని ఓ రచయిత్రి చెప్పింది లేవోయ్-' మరో గాగుల్స్ విసురు.

బస్సు వచ్చింది.

రద్దీ-

ఆ రద్దీలో కావాలనే స్టూడెంట్సు సుచరితను బలంగా రాసుకుంటూ బస్సెక్కారు. అప్పటికే క్రిక్కిరిసిన బస్సులో ఆడా, మగా తేడా ఏమిటి....

సుచరిత కటూ యిటూ వేగ చూపులతో 'పురుష పుంగవులు'- . సభ్యత, సంస్కారం ఈ నాగరిక సమాజానికి అర్థం తెలియని పదాలవుతున్నాయి రోజు రోజుకూ. అలాటి సన్నివేశాలు, వెకిలి చేష్టలు, కుళ్ళు చూపులు, కారుకూతలు

మానవ నాగరికతా పరిణామాన్ని వెక్కిరిస్తుంటాయి.

'ఇంకా ఎన్నాళ్ళురా ఈ ఒంటరి జీవితం'

'ఎన్నాళ్ళు కాదురా.... ఎన్నేళ్లని అడుగు-'

'అడగట మెందుకురా... శుభ్రంగా తెలుస్తూనే వుంది.... మూడని-'

'ఏమిటి....మూడేనా.... ఒకట్లా....?'

'కాదు. ముచ్చటగా మూడు పదులే-'

నడుస్తున్న బస్సులో పరిమళిస్తున్న మేధావివర్గ సంస్కారం-!

అన్నీ వినపడుతున్నా-ఏమీ వినపడనట్లు - తనకు సంబంధంలేని విషయమయినట్లు బయటకు చూస్తూ నిలుచుంది సుచరిత-లోపల మండుతున్న మనసును మౌనంగా చల్లార్చుకుంటూ. '

తప్పదు. ఉడుక్కుంటే ఎదుటి వ్యక్తులు విజృంభించటం తప్ప వినిపించుకోవటం-సిగ్గు పడటం వుండదని సుచరిత అనుభవ రీత్యా ఏనాడో గ్రహించింది.

అందుకే మౌనం-సహనం-నిర్లిప్తత-

సుచరిత తన స్టేజిలో బస్సు దిగింది. మనసునిండా దిగులు-చెవుల్లో ఆఫీసు కొలీగ్స్ మాటలు-

# వేటకుక్కలు

ఆఫీసరు మాటలు- స్టూడెంట్స్ విసుర్లు యింకా యింకా చెవుల్లో ప్రతి ధ్వనిస్తూనే వున్నాయి. ఉదయం వచ్చిన కుళ్ళు లేఖలోని వాక్యాలు పదే పదే మనసును గుచ్చుతున్నాయి.

సుచరిత అద్దె కుంటున్న గది- తన స్నేహితురాలు వందన యింట్లోనే ఓ ప్రక్కగా వుంది. సుచరిత మనసును అర్థం చేసుకునే మనిషి ఈ ప్రపంచంలో వందన ఒక్కతే. బయటి వాతావరణం మనసు నెంత బాధించినా - సుచరిత కొంత ప్రశాంతత ననుభవించేది తన గదిలో నే - ఏకాంతంలో నే.

సుచరిత కాఫీ తాగి వంట పనిలో లీనమయ్యింది

గదికి వచ్చి అర గంటయినా వందన యింకా అటుకేసి రాకపోవటం సుచరితకు ఆశ్చర్యంగా వుంది. పైగా యింట్లో వందన కాని - పిల్లలు కాని కన్పించనేలేదు.

సహజంగా వందన యిల్లు కదలదు. ఒకవేళ బయటకు వెళ్లటమంటూ జరిగితే సుచరితతో కలిసే వెడుతుంది.

**ఇటీవల విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో కళారంజని ఆధ్వర్యాన బి. హెచ్. వై. శర్మగారిచే జరుపబడిన క్షీర సాగర మధనం నృత్య నాటకంలో విష్ణుమూర్తి పాత్రధారిణి చి. వెల్లంకి అర్పిత.**



గేటు బయట స్కూటర్ ఆగింది. వందన భర్త రాఘవ దిగాడు

'ఏమిటండి . రాఘవగారు. . వందన, పిల్లలు కనబడరేం-?'

'ఓహో! మీకు తెలియదుకదా ... వందన అమ్మమ్మ గారికి సీరియస్‌గా వుందని టెలిగ్రాం వచ్చింది మూడింటికి. వెంటనే పిల్లలతో బయలుదేరి వెళ్ళింది అవసరమయితే నేను రాత్రికి గాని... మార్నింగ్ కాని వెడతాను-'

'అయ్యో - అలాగా....'

రాఘవ తన పోర్షన్‌లోకి వెళ్ళిపోయ్యాడు ఒకరి విషయంలో అనవసరంగా జోక్యం చేసుకోటం రాఘవ వ్యక్తిత్వానికి వ్యతిరేకం. వందన - పిల్లలు - ఆఫీసు తప్ప మరో ప్రపంచం తెలియని వ్యక్తి రాఘవ.

రాత్రి పొద్దు పోయేవరకు సుచరిత ఏదో నవల చదువుకుంది. అదే పనిగా మనసునిండా ముసురుకొని చికాకు పరిచే ఆలోచనల నుండి తప్పుకోటానికి చదువుకోటం అలవరచుకుంది సుచరిత

టక్.... టక్.. టక్....

తలుపు తడుతున్న శబ్దానికి సుచరితకు నిద్రాభంగమయ్యింది.

'యింత రాత్రివేళ తలుపు తడుతున్నది ఎవరా....??' గుండెలు భయంతో గుబగుబలాడాయి.

మళ్ళీ తలుపు చప్పుడు - మొదటిసారి కన్నా బలంగా....

'ఎ...వ...రూ....' శక్తినంతా కూడదీసుకుని అడిగింది.

'నేనండి.... రా...ఘ...వను. వందన నుండి మళ్ళీ టెలిగ్రాం వచ్చింది..... రాఘవ ఏదో ఆందోళనగా చెపుతున్నాడు.

అంత భయంలోనూ సుచరిత వినగలిగింది రెండే మాటలు.... వందన.... టెలిగ్రాం...

వెంటనే తలుపు తెరిచింది.

తెరుచుకున్న తలుపులగుండా రివ్వున లోపలికి దూసుకవచ్చాడు రాఘవ.

సుచరిత ఊహించనంత వేగంగా తలుపు మూసి-గట్టిగా కౌగిలించుకున్నాడు. సుచరితకు ఆ షాక్ నుండి తెరుకోవటానికి కొన్ని క్షణాలు పట్టింది.... అంతే! రాఘవను దూరంగా తోసింది.

'రాఘవగారూ.... యిదేమిటి.... దయచేసి బయటకు వెళ్ళండి' సుచరిత ఆడ పులిలా గర్జించింది.

'సుచరితా! నిన్ను.... నిన్ను.... మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను. ప్లీజ్.... నా కోరిక కాదనకు... మన సంగతి వందనకు తెలియకుండా..... నేను జాగ్రత్త పడతాను.... ప్లీజ్....'

రాఘవ!!

ఇతడూ అందరు వల్లిస్తున్న పైత్యాన్నే వల్లిస్తు

న్నాడు అందరు కోరుకుంటున్నదే కోరుకుంటు న్నాడు

కారణం ...?

అందరిలోనూ వున్న 'మగ బుద్ధే' రాఘవలోనూ వుంది.

అందరిలో నున్న 'తోడేలు మనస్తత్వం' రాఘవలోనూ వుంది–

'మిస్టర్ రాఘవ. ప్లీజ్ గెటవుట్ మర్యాదగా వెళ్ళకపోతే అరిచి గోల చేస్తాను. వందనలాటి ఉత్తమ ఇల్లాలికి భర్తవై యుండి కూడా యింత దారుణంగా ప్రవర్తించటం మీ నీచత్వాన్ని చెపుతోంది ... వెంటనే వెళ్ళిపోకపోతే. .. కేకలేస్తా– .

రాఘవ కసిగా చూస్తూ – వేట చేజారిన తోడేలులా గుర్రుగా వెళ్ళాడు.

సుచరిత తలుపు వేసుకొని గుండెల నిండా గాలి పీల్చుకుంది. ఇంతవరకు ఎదిరించిన శక్తి ఒక్కసారిగా అదృశ్యమయ్యింది మంచంపైబడి వాగిలి వాగిలి ఏడ్చింది. తర తరాల పురుషాధిక్యతను కసిలి కసిలి రోధించింది. యుగ యుగాల స్త్రీల వేదనలా కుళ్ళి కుళ్ళి విలపించింది.

ఈ కుళ్ళిన సమాజంలో ఒంటరి స్త్రీ ఎలా బతకాలి?

వయసు దాటుతున్నా పెళ్ళికాని కన్యల గతేమిటి??

అనుక్షణం మాటలతో చూపులతో ప్రవర్తనతో నరక యాతనలకు గురి చేస్తున్న ఈ సమాజ వ్యవస్థలో ఒంటరి స్త్రీ మనుగడ ఎలా???

సుచరిత కన్నీళ్లతో రాత్రంతా ఆలోచించింది

తెల తెలవారుతుండగా. . సన్నని వెలుగు రేఖలా ఓ ఆలోచన సుచరిత మస్తిష్కంలో మెదిలింది

★ ★ ★ ★

ఇప్పుడు సుచరిత ఉద్యోగ రీత్యా వుంటున్న ప్రాంతం– ఆమె పుట్టి పెరిగిన ప్రాంతానికి కొన్ని వందల కిలో మీటర్ల దూరం–

బోసిపోయిన సుచరిత మెడలో నల్ల పూసలు మెరుస్తున్నా యిప్పుడు ఆమె ఏకాంత జీవితానికి ఓ రెండు సంవత్సరాల పసిపాప తోడైందిప్పుడు. సుచరిత భర్త దూరంగా సరిహద్దు ప్రాంతాల్లో పని చేస్తున్న ఓ మిలటరీ ఆఫీసరు

కానీ–

పెళ్ళి కాని ఒంటరి స్త్రీల అందాల్ని కళ్ళతోనే కొరుక్కుతినే 'మగ తోడేళ్లకు' సుచరితకు పెళ్ళై కాలేదని, 'మెడలో మెరిసే నల్ల పూసలు 'మగ చూపుల' నుండి రక్షణ కని, రెండేళ్ల పాప సుచరిత పెంచుకున్న అనాథ బాలికని, మిలటరీ ఆఫీసరు భర్త ఓ అందమైన అబద్ధమని – తెలియదు పాపం!

గత సుచరిత జీవితం కంటె – ఆపద్ధర్మ అబద్ధాన్ని ఆశ్రయించిన నేటి సుచరిత జీవితం కొన్ని వందల రెట్లు ప్రశాంతంగా వుంది.

'వేట కుక్కల' మొరుగులు ఎంతో దూరమయ్యాయి. □


# కలువబాల

నవ వనితా పక్షపత్రిక

# బాలరంజని

పిల్లల సచిత్ర మాసపత్రిక



ఇవి ఆంధ్రపత్రిక ప్రచురణలు